క్లుప్తంగా

కాఫీ శుద్ధి కర్మాగారాన్ని నిర్మించాలి

నర్సీపట్నం : కాఫీ శుద్ధి కర్మాగార నిర్మాణాన్ని నిర్మించి, గిరిజన రైతులు పండిస్తున్న కాఫీకి భరోసా కల్పించాలని ఆదివాసీ సమాఖ్య అధ్యక్షుడు రాంగోపాల్ డిమాండ్ చేశారు. ఏజెన్సీ కాఫీని దేశీయ, అంతర్జాతీయంగా అమ్మకాలు చేస్తూ గిరిజన సహకార సంస్థ లాభాలు పొందుతుందన్నారు. గిరిజన సహకార సంస్థకు కాఫీ శుద్ధి కర్మాగారం లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన నర్సీపట్నంలో గల కాఫీ శుద్ధి కర్మాగారంపై ఆధారపడేవాళ్లు. గిరిజనుల నుంచి సేకరించిన కాఫీని ఇక్కడ శుద్ధి చేయించి జీసీసీ అమ్మకాలు సాగించేదన్నారు. సకాలంలో శుద్ధి ప్రక్రియ కాకపోవడంతో జీసీసీ నష్టపోయేదన్నారు. ఈ సమస్యను అధికమించడానికి గత ప్రభుత్వం నర్సీపట్నంలో కాఫీ శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం కాఫీ శుద్ధి కర్మాగారాన్ని నిర్మించి కాఫీ పండిస్తున్న గిరిజనులకు అండగా ఉండాలని ఆయన కోరారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు బుధవారం వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన గైనికాలజిస్టు పద్మిని విద్యార్థులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. గైనిక్ సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వర్షాల కారణంగా వ్యాధులు సోకే అవకాశం ఉందని విద్యార్థులు ఆరోగ్యసూత్రాలు పాటించాలని కోరారు. అవసరం అయిన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో గొలుగొండ వైద్యాధికారి కీర్తితో పాటు వైద్య, కస్తూర్బా సిబ్బంది పాల్గొన్నారు.

జోగుంపేటలో పారిశుధ్య పనులు


పొక్లెయిన్‌తో పనులు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : జోగుంపేట పంచాయతీలో బుధవారం నుంచి పారిశుధ్య పనులు ప్రారంభించారు. సర్పంచ్ లక్ష్మి, కార్యదర్శి రఘు ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. గ్రామ వీధుల్లో పేరుకుపోయిన చెత్తను పొక్లెయిన్‌తో బయటకు తీయించి ట్రాక్టర్‌తో బయటకు పంపుతున్నట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామంలో పారిశుధ్య సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తాగునీటి, కుళాయిలు, చేతిపంపు బోర్లు వద్ద ఈ పనులు చేస్తున్నట్టు సర్పంచ్, కార్యదర్శి తెలిపారు.

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి


గొలుగొండ ఎస్‌ఐ రామారావు

గొలుగొండ : గ్రామాల్లో త్వరలో నిర్వహించే వినాయక చవితికి కమిటీ సభ్యులు అన్ని అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని గొలుగొండ ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించి గ్రామాల్లో చవితి ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. ఊరేగింపు సందర్భంగా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

రోలుగుంట : విద్యార్థినుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతూ విధిగా వైద్య సూచనలు పాటించేలా చూడాలని నర్సీపట్నం డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి ప్రిన్సిపాల్ తులసికి సూచించారు. స్థానిక కేజీబీవీని ఆమె స్థానిక పీహెచ్‌సీ వైద్యులు కె.ధనలక్ష్మి, వెంకట శ్రావణితో కలసి బుధవారం సందర్శించారు. విద్యార్థులకు ఇస్తున్న ఆహారం, వారి ఆరోగ్య పరిస్థితులు, నెలవారీగా విద్యార్థులకు శిబిరాల ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

బుచ్చెయ్యపేట : రక్తహీనత గల రోగుల పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపి రోగులు కోలుకునేలా చూడాలని జిల్లా టాస్క్ ఫోర్స్ టీం ప్రధాన అధికారిణి లూసీ కార్డియా తెలిపారు. బుధవారం తురకలపూడి ప్రభుత్వ ఆస్పత్రిని టీం సభ్యులు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి ఇప్పటి వరకు ఎంత మందికి రక్త పరీక్షలు చేసినదీ పరిశీలించారు.

ముస్తాబవుతున్న గణనాథులు


దత్తాత్రేయ రూపంలో ఆకట్టుకుంటున్న వినాయక విగ్రహం


తుది మెరుగులు దిద్దుకుంటున్న భారీ వినాయక విగ్రహాలు


పంచముఖ విఘ్నేశ్వరుడు

- చౌడువాడలో భారీగా వినాయక విగ్రహాల రూపకల్పన
- ఆకర్షణీయ రూపాల్లో గణనాథులకు ప్రాణం పోస్తున్న తయారీదారులు
- ఉత్తరాంధ్రతో పాటు ఒడిశాకూ విగ్రహాల ఎగుమతి
- అడుగు ఎత్తు నుంచి పదమూడు అడుగుల ఎత్తు విగ్రహాలు
- 150 మందికి స్వయం ఉపాధి

కె.కోటపాడు : పలు ఆకర్షణీయమైన రూపాల్లో వినాయక విగ్రహాలు చౌడువాడలో రూపొందుతున్నాయి. వినాయక నవరాత్రి ఉత్సవాలకు మండపాల్లో కొలువుదీరడానికి వివిధ ఆకృతుల్లో గణనాథులను విగ్రహాల తయారీదారులు తీర్చిదిద్దుతున్నారు. వినాయక విగ్రహాల తయారీలో అనకాపల్లి జిల్లాలో చౌడువాడ ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. ఈ ఏడాది అడుగు ఎత్తు నుంచి 13 అడుగుల ఎత్తు వరకూ గల విగ్రహాలను తయారు చేస్తున్నారు. కొనుగోలుదారులకు తక్కువ ధరలకే తయారీదారులు వినాయక విగ్రహాలను విక్రయించడంతో చౌడువాడలో కొనుగోలు చేసేందుకు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఉత్సవాల నిర్వాహకాలు తరలి వస్తుంటారు.

2500 వినాయక విగ్రహాల తయారీ...

గ్రామానికి చెందిన 150 మంది యువకులు, మహిళలు ఈ వినాయక విగ్రహాల తయారీని చేపడుతున్నారు. మట్టితో తయారు చేసిన వస్తువులకు ఆదరణ తగ్గడంతో గ్రామంలో గల కుమ్మర్లు ప్రత్యామ్నాయ వృత్తులపై దృష్టి సారించారు. గ్రామంలో కుమ్మర వర్గానికి చెందిన యువకులు హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో వినాయక విగ్రహాల తయారీలో శిక్షణ పొందారు. శిక్షణ పొందిన వారు చౌడువాడ గ్రామంలో తమ తోటి వారితో పాటు స్నేహితులతో కలిసి ఏటా విగ్రహాల తయారీ చేపడుతున్నారు. వినాయక చవితికి ఐదు నెలలు ముందుగా ఈ గ్రామంలో విగ్రహాల తయారీని వీరు ప్రారంభిస్తారు.

ఇతర రాష్ట్రాల్లోనూ అమ్మకాలు..

చౌడువాడలో తయారు చేసిన వినాయక విగ్రహాలకు మంచి డిమాండ్ ఉంటుంది. విగ్రహాల తయారీతో పాటు రంగులు ఆకర్షణీయంగా ఉండడంతో కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపుతుంటారు. ఇక్కడ తయారీ చేపట్టిన విగ్రహాలను ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరితో పాటు ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారు వచ్చి కొనుగోలు చేసి ఆయా ప్రాంతాల్లో అమ్మకాలు చేసేందుకు విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై తీసుకువెళ్తుంటారు.

ఆకట్టుకునే రూపాలలో..



వినాయక విగ్రహాల తయారీలో శిక్షణ పొందాం. చౌడువాడలో తయారు చేసిన వినాయక విగ్రహాలకు జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో మంచి డిమాండ్ ఉంది. శేషపాన్పు ధరిత వినాయకుడు, పార్వతీ తనయ వినాయకుడు, పంచముఖ వినాయకుడు, తుంబురనారద వినాయకుడు, శివలింగధారుడైన వినాయకుడి విగ్రహాలతో పాటు పలు ఆకర్షణీయమైన రూపాల్లో విగ్రహాలను తయారు చేశాం. సొంత గ్రామంలోనే పలువురి యువకులకు ఉపాధి కల్పించి తయారీ చేపట్టడంతో తక్కువ ధరలకే విగ్రహాలను అందిస్తున్నాం.

– ఎం.ఈశ్వరరావు, విగ్రహాల తయారీదారు, చౌడువాడ

గురువులు...ఆదర్శనీయులు

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవ స్థానం ఉంది. గురుదేవోభవ అంటూ పూజ్యనీయులైన గురువులను సత్కరించుకునే సుదినం నేడు. పిల్లలకు విద్య గరపడంతో పాటు వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దే గురువులు ఎంతో ఆదర్శనీయులు..నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా


వీరనారాయణం పాఠశాలలో డిజిటల్ తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయుడు ఆనంద్

మాడుగుల : ప్రభుత్వ పాఠశాలలో సరైన విద్య అందదని, ప్రైవేట్ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఎక్కువగా మొగ్గు చూపుతారు. అయితే అదొకప్పటి మాట. మండలంలో వీరనారాయణ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కార్పొరేట్ పాఠశాలకు దీటుగా మార్పు చెందింది. అందుకు అక్కడి ఉపాధ్యాయుడు పీవీ ఆనంద్ కృషి ఎంతో ఉంది. పాఠశాల అనంతరం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు వెనుబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించడం, తల్లిదండ్రులుకు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యపై పూర్తి అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు ఆసక్తి పెంపొందించడానికి డిజిటల్ తరగతులు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక...

పాఠశాల ఉపాధ్యాయుడు ఆనంద్ విద్యార్థులకు అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనను ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక చేసింది. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆనంద్ జిల్లా కలెక్టరు చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

బడిని..గుడిగా మలిచిన మాస్టారు..



చోడవరం రూరల్ : మండలంలో 62 పాఠశాలలు ఉంటే..ఆ పాఠశాల స్థానం 60. అయిదు తరగతులకు బోధించే అవకాశం.. కానీ ఉన్నది కేవలం 18 మంది విద్యార్థులు. ఇద్దరు ఉపాధ్యాయులు. పాఠశాల భవన సముదాయం, తగినంత ఆటస్థలం ఉన్నా పిచ్చి తుప్పలతో నిండి తగిన రక్షణ లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉండేది. ఈ పరిస్థితిలో పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా చేరిన బల్జి నాగరాజు పాఠశాల రూపురేఖలు మార్చాలనుకున్నారు. పాఠశాల కమిటీ, గ్రామ పెద్దలు, యువతను కదలించారు. శ్రమదానంలో పాలుపంచుకునేలా చేశారు. పిచ్చితుప్పలను తొలగించి, భవనాలకు రంగులద్దించి బడిని సుందరంగా మలిచారు. విద్యార్థుల చేరికను ప్రోత్సహించారు. దీంతో పాఠశాలను అగ్రస్థానానికి చేర్చారు. మాస్టారు చేరే నాటికి 18 మంది ఉన్న విద్యార్థులు 2021–22 విద్యాసంవత్సరానికి 45 మందికి చేరారు.

చదువుకున్న పాఠశాలకే గురువుగా...


విద్యార్థులకు బోధిస్తున్నహెచ్‌ఎం నాగేశ్వరరావు

కె.కోటపాడు: గొండుపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రొంగలి నాగేశ్వరరావు అదే పాఠశాలలో చదువుకున్నారు. తల్లిదండ్రులు దేముడు, రామయ్యమ్మ వ్యవసాయ కూలీలు. ఆయన ఈ పాఠశాలలో 1984–91లో ఏడో తరగతి వరకూ చదువుకున్నారు. ఎం.ఏ, బీఈడీ చదివిన నాగేశ్వరరావు 2006 నుంచి రెండేళ్ల పాటు బెంగళూరులో ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేశారు. 2008 డీఎస్సీలో ఎస్‌జీటీగా ఎంపికయ్యారు. 2021 నుంచి స్వగ్రామంలో తాను చదువుకున్న పాఠశాలలో హెచ్‌ఎంగా సేవలందిస్తున్నారు. ఏటా ఈ పాఠశాల విద్యార్థులు టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక


జె.అమృతరావు


ఎస్.వీరాంజనేయులు

కె.కోటపాడు : కె.కోటపాడు మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీ విభాగంలో ఎ.కోడూరు గణిత ఉపాధ్యాయుడు జె.అమృతరావు అవార్డుకు ఎంపికయ్యారు. ఎస్‌జీటీ కేటగిరీలో పాచిలవానిపాలెం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వీరాంజనేయులు, ఆర్లి ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.త్రినాథ్ ఎంపికయ్యారు. వీరికి గురువారం అనకాపల్లిలో జరిగే గురుపూజోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేస్తారు.

చోడవరం : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా రావికమతం మండలం టి.అర్జాపురం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు విద్యావతి ఎంపికయ్యారు. ఈనెల 5వతేదీన గురుపూజోత్సవం సందర్భంగా ఈమె ఆ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఆమెకు మండల విద్యాశాఖాధికారి తలుపులు బ్రహ్మాజీ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, రాష్ట్ర కార్యదర్శి గ్రబ్రెడ్డి నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగలక్ష్మి, సర్పంచ్ ఫల్గుణ, వైస్ ఎంపీపీ భవానీ ప్రసాద్ అభినందనలు తెలిపారు.

నూతన ఎస్‌ఐకి నేతల శుభాకాంక్షలు


స్టేషన్‌లో ఎస్‌ఐని కలసిన వైఎస్సార్‌సీపీ నేతలు

గొలుగొండ : మూడు రోజుల క్రితం గొలుగొండ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ రామారావును గొలుగొండ మండలం వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పనిచేసిన కృష్ణారావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రామారావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, యూత్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణనాయుడుతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మట్టి విగ్రహాలతో కాలుష్య నివారణ

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దంపతులకు మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మాడుగుల : ప్రస్తుతం జల కాలుష్యం లేకుండా ప్రతి ఒక్కరూ వినాయక, దేవీ, నవరాత్రి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే వినియోగించాలని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులు తారువాలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దంపతులకు మటి మట్టివినాయక ప్రతిమలు అందజేశారు. ప్రతియేటా ట్రస్టు తరుపున వేలాది వినాయక మట్టి ప్రతిమలు ఉచితంగా గ్రామాల్లో అందజేస్తూ జలకాలుష్య నివారణకు సహాయ పడుతున్న భారత నిర్మాణ సేవా ట్రస్టు సభ్యులను ఆయన అభినందించారు.

మట్టిగణపతినే పూజిద్దాం

కె.కోటపాడు : పర్యావరణ హితానికి ప్రతి ఒక్కరూ మట్టిగణపతినే వినాయక చవితి పర్వదినం సమయాల్లో పూజించాలని కె.కోటపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి అన్నారు. హైస్కూల్‌లో 20 మంది విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలతో కలిసి బుధవారం కె.కోటపాడులో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను ఎంఈవో–1, 2 సత్యనారాయణ, డీ.వీ.డీ.ప్రసాద్, ఏఎస్‌ఐ అప్పారావులకు అందించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష


అంగన్‌వాడీ కేంద్రంలో ఆకు కూరలతో తయారు చేసిన పోషకాహారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల: తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్షని, అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం ప్రతి గర్భిణి సద్వినియోగం చేసుకోవాలని, స్థానిక శాసన సభ్యుడు బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. బుధవారం స్థాని క ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ . శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న కూరగాయలతో తయారు చేసిన పోషకాహార ప్రదర్శన తిలకించి అభినందించారు.

నాతవరం : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు సలహాలు సూచనలు పాటిస్తే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడియస్ సూపర్‌వైజరు విజయలక్ష్మి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం –3లో బుధవారం పౌష్టికాహర మాసోత్సవాల్లో భాగంగా అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు.

దేవరాపల్లి: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రాములమ్మ అన్నారు. ఈ మేరకు దేవరాపల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. హాజరైన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.

బుచ్చెయ్యపేట : మంగళాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా బుధవారం వెల్ బేబీ షో నిర్వహించారు. పౌష్టికాహారం తీసికోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న పిల్లల బరువులు తూచి వెల్ బేబీ షో నిర్వహించారు. సర్పంచ్ కె పద్మరేఖ, ఏఎన్‌ఎం రవణమ్మ, అంగన్వాడీ టీచర్ రాధ పాల్గొన్నారు.

పెద్దేరులో జారిపడి దుక్కిటెద్దు మృతి


మృతి చెందిన ఎద్దును పరిశీలిస్తున్న కె.జె.పురం పశువైద్యాధికారి మణిలక్ష్మణ్

మాడుగుల రూరల్ : మండలంలో జి.అగ్రహారం పెద్దేరు నదిలో ప్రమాదవశాత్తూ కాలుజారి దుక్కిటెద్దు బుధవారం మృతి చెందింది. ఈ గ్రామానికి చెందిన వెలుగుల కోటి అనే రైతుకు చెందిన రెండు దుక్కెటెద్దులు బుధవారం మేతకు వదిలారు. అవి పెద్దేరు నదీ పరివాహంలో మేత మేస్తుండగా ఒక ఎద్దు ప్రవాహం ఎక్కువగా వున్న పెద్దేరు నదిలో దిగింది. అక్కడ పెద్ద గొయ్యి ఉండడంతో అందులో మునిగి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు యజమాని వెలుగుల కోటి ఫిర్యాదుతో కె.జె.పురం పశువైద్యాధికారి ఎం. మణిలక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకొని, మృతి చెందిన ఎద్దును పరిశీలించారు. విపత్తులు సహాయ పథకం కింద ప్రతిపాదన పంపిస్తామని వైద్యాధికారి తెలిపారు. ఎద్దు ఖరీదు సుమారు ఒక లక్షా యాభై వేలు ఉంటుదని యజమాని కోటి తెలిపారు. బాధిత రైతు కోటిని సర్పంచ్ నందారపు మంగమ్మ పానాపతి, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి, నాయుడు పరామర్శించారు.

గల్లంతైన రైతు కూలీ మృతి

చోడవరం రూరల్ : ప్రమాదవశాత్తూ పెద్దేరు నదిలో మంగళవారం గల్లంతైన వ్యవసాయ కూలీ ఆకుల నాగరాజు(57) నదీగర్భంలో విగతజీవుడై బుధవారం దర్శనమిచ్చాడు. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ నాగరాజు ఆచూకీ లభించని సంగతి విదితమే. బుధవారం ఉదయం నుంచి పలువురు యువకులు, రెస్క్యూ టీం తిరిగి గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు మధ్యాహ్నం మూడుగంటల సమయంలో నాగరాజు మృతదేహం లభ్యం కావడంతో నది గట్టుకు చేర్చారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీయార్ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శేఖరం తెలిపారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

కె.కోటపాడు : మండలంలో 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా వారి తల్లిదండ్రులు వ్యాదినిరోధక టీకాలను వేయించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ అన్నారు. ఎ.కోడూరు హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో బుధవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను వేసే కార్యక్రమం జరిపారు. 14 మంది చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలతో పాటు 9 మంది గర్భిణులకు ధనుర్వాతం బారిన పడకుండా టీకాలను వేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఏఎన్‌ఎం సంతోషికుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్ సూరినాయుడికి పితృ వియోగం

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ మండల యువజన అధ్యక్షుడు, మామిడిపల్లి సర్పంచ్ కర్రి సూరినాయుడుకు పితృవియోగం కలిగింది. కర్రి సూరినాయుడు తండ్రి కర్రి వెంకటరావు(75) బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. వెంకటరావు మృతికి మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్‌ఐలు బాధ్యతల స్వీకారం


ఎస్.మల్లేశ్వరరావు

దేవరాపల్లి: దేవరాపల్లి ఎస్‌ఐగా టి.మల్లేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. తాజాగా పరవాడ పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై వచ్చిన మల్లేశ్వరరావు గతంలో పెదబయలు, సబ్బవరం, కె.కోటపాడు మండలాల్లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తించారు.


ఎస్‌ఐ ధనుంజయ్

కె.కోటపాడు : కె.కోటపాడు ఎస్‌ఐగా ఆర్.ధనుంజయ్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా సబ్బవరం ఎస్‌ఐగా పని చేస్తున్న ఆయనను కె.కోటపాడుకు బదిలీ చేశారు. కె.కోటపాడు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.